


గోపాలానికి రైలంటే భయం. ప్రయాణం అంటే మరీ భయం. ప్లాటుఫారం నిండా జనం నెత్తిమీద పెట్టెలు పెట్టుకుని, మూటలు భుజాన వేసుకుని పరుగెత్తుతుంటారు. ఇంజను గట్టిగా కూస్తుంది. రైల్వేకూలీలు ఇతరుల బరువులు మోస్తూ కిటికీలగుండా ఖాళీకోసం తొంగిచూస్తుంటారు. గార్డు జండా ఊపుతుంటాడు. ఈల ఊదుతాడు. గడియారం ముల్లు అడుగులో అడుగు వేసుకుంటూ సాగుతుంటుంది. రైలు ఇక ఏ క్షణాన్నైనా బయలుదేరుతుంది. తనకు చోటు దొరుకుతుందో దొరకదో. కడ్డీలు పట్టుకుని వేళ్ళాడుతూ ప్రయాణం చేస్తారు కొందరు. చేయి జారిపోతే! రైలుపట్టాలమీద చక్రాలు నిర్దాక్షిణ్యంగా కర్కశంగా దొర్లిపోతుంటాయి. ఈ రైలు తను ఆపలేడు. తనను ఎవరూ చూడరు. అరుద్దామనుకుంటాడు. గొంతు పెగలిద్దామంటే మెడమీద రైలు చక్రాలు. ఎట్లా?... ఎట్లా... తను అరవకపోయినా తన ఆక్రందన అమ్మకు మాత్రం వినబడుతుంది. గోపాలం... నాయనా గోపాలం... అంటూ గుండె బాదుకుంటూ వస్తుంది.

గోపాలం గుండె దడదడలాడుతోంది. ప్లాటుఫారం మీద స్తంభానికి ఆనుకుని అమ్మ కూర్చుంది. చేతికర్ర వదిలేసి స్తంభాన్ని పట్టుకుంది, కొడుకు వస్తే ఆసరా చేసుకుని మెల్లిగా వచ్చి రైలు ఎక్కుదామని. ఈ ప్రయాణం గోపాలానికి సుతరామూ ఇష్టంలేదు. ఎట్లాగైనా వెళ్ళి తీరాల్సిందే అన్నది భార్య. ఇంకో పని ఇంకో పనీ అయితే సరే అనేదే. మొక్కుబడి అన్న

తర్వాత తీర్చుకోవలసిందే. నరసింహస్వామి దయలేకపోతే ఈ కొడుకు తన కళ్ళ ముందు మెసిలేవాడు కాదు. వాడికి ఏడాది ఇంకా నిండలేదు. నవ్వుతాడు. నవ్విస్తాడు. ఏడుస్తాడు. బాబు ఏడ్చినా తనకు నవ్వే వస్తుంది. గుండెనిండా సంతోషం పొంగి పొర్లుతుంది. ఆ అలల తాకిడికి తన శరీరం అంతా పులకరిస్తుంది. ఈ నలుసన్నా దక్కితేనే తన జీవితానికి అర్థం. పుట్టగానే నరసింహ అని పేరు పెట్టుకుని కాచుకున్నారు. బారసాలదాకా నామకరణం ఆగలేదు. 'స్వామీ... నిన్ను దర్శనం చేసుకుని మొక్కు చెల్లించుకుంటాను... చల్లగా చూడు...' ఈ మాట రోజూ పదిసార్లన్నా అంటుంది గోపాలం భార్య పార్వతమ్మ. ఎప్పటికప్పుడు ఏదో ఆటంకం. పిల్లవాడికి జలుబు, దగ్గు ఒకసారి. ఆకాశానికి జలుబు, దగ్గువచ్చి వానలు ఉరుములు, మెరుపులు ఒకసారి. బాబుకి జ్వరం వస్తే ఒకసారి. సూర్యుడు కళ్ళెర్రజేసి భూమి అంతా వడగాడ్పులతో వేడెక్కిపోవడం ఒకసారి. ఈసారి మొండికేసి బయలుదేరాడు. నేనూ వస్తానంది తల్లి అన్నపూర్ణమ్మ... రావచ్చు తను ఆసరా కానిదే నడవలేదు. ఆ జనంలో రైలెక్కలేదు. అది కాదు. నరసింహస్వామి కొండ ఎక్కలేదు. దిగలేదు. అయినా వస్తానంటుంది. 'నీ ఇష్టం' అన్నాడు గోపాలం. ఆమె రావటానికి వీల్లేదు అంది పార్వతమ్మ... ఒక్క రోజు గుడికిపోయి మొక్కు తీర్చుకువస్తామంటే అక్కడకు కూడా రావాలా అంది. నేను చేయలేను అన్నది. 'మీరూ మీ అమ్మా పోయి పిల్లాడి మొక్కు తీర్చుకురండి' అంది. ఇంకా అనేకం అనాలని అనుకున్నది. అవన్నీ అనలేదు. నోరు విప్పకుండానే గోపాలం బయటకు వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. పార్వతమ్మ ఆ మాటలు మళ్ళీ ఎత్తలేదు.

రైలు ఇంకొంచెంసేపటిలో వస్తుంది. ప్లాటుఫారంమీద జనం తొక్కిసలాడుతున్నారు. రైలు ఎక్కువసేపు ఆగదు. ఆ కొంచెం సేపట్లోనే లోపలకు చొరబడాలి. అమ్మ నిస్సహాయంగా కూర్చుని ఉన్నది. పక్కనే పార్వతమ్మ ఒళ్లో నరసింహ కేరింతలు కొడుతున్నాడు. ఎటువంటి బాధ్యత లేదు. రైలు ఎట్లా ఎక్కడమా అన్న ఆదుర్దా లేదు. ఆకలివేసినప్పుడు పాలు ఎట్లా వస్తాయా అన్న ఆందోళన లేదు. పెరిగిన ధరల ఆచూకి తెలియదు. రైలెక్కటానికి టిక్కెట్టు అక్కరలేదు. ఆకాశంలో మబ్బులవంక, ప్లాటుఫారం మీద గాలికి తిరిగే పంఖా వంక చూస్తూ నవ్వుకుంటున్నాడు. గోపాలం అతని వంకే చూస్తున్నాడు. అట్లా తనెప్పుడన్నా ఉన్నాడా? క్షణక్షణం అంతులేని భయాలు మనసుని పిండివేస్తున్నాయి. కాని తనూ ఒకప్పుడు తల్లి ఒడిలో అట్లా నిశ్చింతగా పడుకుని నవ్వుకునే ఉంటాడు. కాని తనకు తెలియదు. అనుభవంలోనికి రాని ఆనందం అది... దూరాన... సిగ్నలు దాటి, తాటితోపులు దాటి కనిపిస్తున్న పొగ. రైలు వస్తూంది. ఈ ప్రయాణానికి ఎంత ప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది. ఎన్ని ఏర్పాట్లు చేసుకున్నా టైము సరిపోదు. ఆఖరిక్షణంలో కంగారుగా ఉంటుంది. ఇంకొంచెం టైముంటే బాగుండును అనిపిస్తుంది. చెయ్యాల్సిన పనులెన్నో మిగిలిపోయాయి. అయినా అన్నిటినీ వదిలేసి ఉక్కిరిబిక్కిరిలాడుతూ పరుగెత్తుకుంటూ వచ్చారు. స్టేషనుకు వచ్చిన తర్వాత తెలిసింది రైలు మూడుగంటలు ఆలస్యం అని. ప్రయాణం ముందరే స్పష్టంగా చెప్పింది పార్వతమ్మ "అన్నపూర్ణమ్మను తీసుకురావద్దూ" అని. గోపాలం మొండికేసి తీసుకువచ్చాడు. నాకేం బాధ్యత లేదు. ఆమె సంగతి మీరే చూసుకోవాలి అని చెప్పింది. ఆ పట్టుదల మీదనే ఉన్నది. ఆమెవంక గూడా చూడటం లేదు. అన్నపూర్ణమ్మ పిలిచినా వినబడనట్లే ఊరుకున్నది. మిట్టమధ్యాహ్నం అయినా రైలు రాలేదు. ఒళ్ళో బాబు ఏడిస్తే పాలు ఇచ్చింది. నిద్రబుచ్చింది. అన్నపూర్ణమ్మ మంచినీళ్ళడిగినా ముఖం అటు పక్కకు తిప్పలేదు. పిల్లాడిని ఆడిస్తున్న నెపంతో మూటముల్లె అక్కడే వదిలేసి ప్లాటుఫారం

రెండో చివరకు పోయి కూర్చుంది. ఎంతసేపని కూర్చుంటుంది. వంటరితనం క్షణాల్లో వచ్చేసింది. మళ్ళీ తిరిగివచ్చేటప్పటికి అన్నపూర్ణమ్మ సంచీ తలకింద పెట్టుకుని ముడుచుకుపడుకుంది. కళ్ళు మూసుకున్నదిగాని నిద్రపోతున్నదో లేదో తెలియటం లేదు. గోపాలం దూరంగా వస్తున్న పొగవంక చూస్తున్నాడు. ప్లాటుఫారం మీద గంట గణగణమోగింది. జనం అంతా లేచారు. ఎవరో కుర్రాడు గంట మోగించాడు. రైల్వే కూలీ వచ్చి అతన్ని కేకవేస్తున్నాడు. రైలు వచ్చేసింది. అమ్మను లేపాలి. సామాను తీసుకోవాలి. భార్యను, బిడ్డను జాగ్రత్తగా తీసుకువెళ్ళాలి. ఇన్ని బాధ్యతలతో తను ప్రయాణం చెయ్యలేదు. ముఖంమీద చిరుచెమట పట్టింది. రైలు వేగంగా వచ్చేస్తున్నది. ఎంతసేపు ఆగుతుందో... ఏమో... పచ్చజెండాలు ఎగురుతున్నాయి. ఆ రైలు ఆగనే లేదు. జనం కొంతమంది ప్లాటుఫారం చివరదాకా పరుగెత్తుతున్నట్లు నడుస్తున్నారు. కూలీలు మటుకు నిశ్చింతగా కూర్చునే ఉన్నారు. ఈ రైలు చిన్న ఊళ్ళో ఆగదని వాళ్ళకు తెలుసు. ఎక్స్‌ప్రెస్ బళ్ళు రోజుకు ఎన్నివస్తాయో వాళ్ళకి గుర్తే. అమ్మను నిద్రలేపి, సామాను భద్రపరుచుకుని ముందుకు సాగే గోపాలం రైలు వెళ్ళిపోయి దూరాన తాటితోపుల అవతల పొగలాగా మారిపోయేవరకు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

మళ్ళీ జనం అంతా సర్దుకునేటప్పటికి ఎంతో టైము పట్టలేదు. "చాయ్... గరం... గరం..." పోనీ టీ తాగితే కొంచెం ఉత్సాహంగా ఉంటుందనుకున్నాడు.

"రైలెప్పుడు వస్తుంది..."

"ఏడకు పోవాలి..."

"యాదగిరిగుట్ట పోయేదుంది..."

"ఇప్పుడొస్తుంది కూర్చో..."

తను కూర్చోలేదు. టీ తాగాడు. మంచినీళ్ళు తాగాడు. అన్నం మూట అక్కడే ఉన్నది. తిందామనుకున్నాడు. ఇప్పటికే చాలా పొద్దెక్కింది. రైలెప్పుడు వస్తుందో ఏమో.

'పార్వతమ్మా... పార్వతమ్మా...' అన్నపూర్ణమ్మ మూలుగుతున్నట్లు పిలుస్తోంది. పార్వతమ్మ మెల్లిగా లేచింది. ఆమె మూలుగు వినబడనట్లుగా లేచింది. బాబును బుజాన వేసుకొని ఎటో చూస్తూ ముందుకు అడుగు సాగించింది. అన్నపూర్ణమ్మకు నీరసం వచ్చి ఉంటుందని తెలుసు. లేచి కూర్చునే ఓపిక గూడా లేదని తెలుసు. అటువంటి పరిస్థితిలో తమతోపాటు ఎందుకు బయలుదేరాలి. వద్దంటే అంత పట్టుదల ఎందుకు? నిశ్చింతగా పోయి వచ్చేవాళ్ళు తామయితే. ఇంటిదగ్గరయితే కావలసింది చేసిపెట్టుతూ మంచీచెడ్డా చూస్తూనే ఉన్నది తను. ఇక్కడకు కూడా రావాలా... పార్వతమ్మ వళ్ళు మండిపోయింది.

'నా సంగతి నువ్వేం చూడక్కర్లేదు తల్లీ... మా అబ్బాయి చూస్తాడులే' అంది అన్నపూర్ణమ్మ. ఆ మాట మరీ చిరాకెత్తింది. ఎంతసేపు 'అమ్మా... అమ్మా' అంటూ కొంగుపట్టుకు తిరుగుతుంటే తన సంగతి చూడక్కర్లేదా? చిన్నపిల్లాడి సంగతి చూడక్కర్లేదా? అమ్మా... ఆయనా కలిసి ఊరేగనీయండి. గింజుకున్నా మళ్ళీ ఇంటికి చేరేటంతవరకు పచ్చిమంచినీళ్ళన్నా ఇవ్వకూడదు. ఒకసారి నిక్కచ్చిగా ఉంటేగాని వాళ్ళకు తెలిసిరాదు. చేసినకొద్దీ చాకిరీ చేయించుకుంటారు. మరీ చులకనయిపోతోంది చివరకు. యాదగిరిగుట్ట ఎక్కడమంటే మాటలా? ఎన్ని మెట్లు? వయసులో ఉన్నవాళ్ళకే కాళ్ళు పట్టుకుంటాయి. ఈ ముసలమ్మను పైదాకా ఎట్లా తీసుకువస్తాడో తనూ చూస్తుంది. ఒకసారి మెదలకుండా ఊరుకుంటేనేగాని అందరికీ తెలిసిరాదు. అన్నపూర్ణమ్మ పిలుపు వినిపించుకోకుండా నిర్లిప్తంగా ముందుకు సాగిపోయింది పార్వతమ్మ. రైలు బ్రిడ్జి

కిందుగా బెంచిమీద కూర్చుంది. బాబు ఏడుపు మొదలు పెట్టాడు. పాలిచ్చింది. తనకు ఆకలేస్తున్నది. పొద్దున్నే వస్తుందనుకున్న రైలు ఇంతవరకు రాకపోయే. పులిహోర మూటకట్టుకుని తెచ్చుకున్నారు. మొక్కుబడి అయిన తర్వాత తిందామనుకున్నారు. ఇక్కడే ఇంత పొద్దుపోయే. తనకే ఇంత ఆకలేస్తుంటే ఆ ముసలిప్రాణం ఎంత కొట్టుకుంటోందో! ఆకలితో బాధపడుతుంటుంది. అన్నీ తను చూసుకుంటానన్నాడుగా, ఆ గోపాలాన్నే చూసుకోమను. పార్వతమ్మ లేవబోయి మళ్ళా కూర్చున్నది కాసేపు. ఎదురుగా ఒక మేక, పిల్లలకు పాలిస్తూ రైలు పట్టాలమీద నిలబడింది. కూలీ ఒకతను గబగబా నడుస్తున్నాడు. ఎందుకు...? రైలు వస్తుందేమో!

'రైలు వస్తోందా...?'

'ఆఁ...'

పార్వతమ్మ గబుక్కున లేచింది. ఎదురుగా మేకపిల్లలు పట్టాల మీదనే ఉన్నాయి. 'ఇశ్... ఇశ్...' వాటిని తోలింది. అవి కదలటంలా. చిన్న చిన్న రాళ్ళు విసిరింది. మేక తల ఆడించి అట్లాగే నిలబడింది. మేకపిల్లలు కాళ్ళు ఎగరేస్తూ తలతో కుమ్ముతూ ఆనందంగా పాలు తాగుతున్నాయి. రైలు వస్తోంది. తను అక్కడ ఆగలేదు. తనకోసం తనవాళ్ళు ఎదురుచూస్తుంటారు. బండి వచ్చినా రాలేదని కంగారుపడుతుంటారు. మేకపిల్లల వంక చూస్తూ రైల్వే కూలీతో వాటిని పట్టాల మీదనుంచి తోలమని చెబుదామనుకుంటూ ముందుకు నడిచింది. చేతిలో పిల్లవాడు మళ్ళీ ఏడుస్తున్నాడు. పాలివ్వటానికి టైం లేదు. అన్నపూర్ణమ్మను అక్కడే వదిలేసింది. మంచినీళ్ళడుగుతే ఇవ్వలేదు. పిలిస్తే పలకలేదు. స్వతంత్రంగా నడవలేదు. ఆమె సరిగ్గా కదలనూ లేదు. అట్లాంటి నిస్సహాయురాలిని వదిలేసి తను ప్రయాణం చెయ్యాలనుకుంది. గోపాలాన్ని అన్నీ చూసుకోమన్నది. అన్నపూర్ణమ్మ నోరు తెరిచి గోపాలాన్ని ఏమీ అడిగి ఉండదు. పసికందు అయితే ఏడుస్తాడు. ముసలివగ్గు ఎవరితో చెప్పుకుంటుంది. పార్వతమ్మకు వణుకు ఎక్కువయింది. తనదృష్టిలో చేతిలో పసికందుకు, ఆ ముదుసలికీ తేడా కనపడటం లేదు. ఆమె సంగతి కనుక్కోందే రైలెక్కదు తను. పార్వతమ్మ ఆందోళన పడుతూ నడుస్తోంది.

'ఏమండీ... ఏమండీ...'

'ఎక్కడికి పోయావు ఇంతసేపు... రైలు వచ్చేస్తుంటేను...'

'మీ అమ్మకు అన్నం పెట్టి పోదామండి... ఎంత నీరసపడిందో ఏమో?'

అన్నపూర్ణమ్మ చేతికర్రతో మెల్లిగా లేస్తోంది.

'ముందు రైలెక్కాలి... సంచీ పట్టుకో...'

'మీ అమ్మకు అన్నం పెట్టాలండి ముందు... ఎంత నీరసపడిందో పిలిస్తే పలకకుండా వెళ్ళిపోయానండి.' పార్వతమ్మ కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి.

"అన్నం పెట్టానులే... నువ్వు అలిగితే నేను ఊరుకుంటాననుకున్నావా..." గోపాలం పార్వతమ్మ వంక చూడకుండా మూట పట్టుకుని తల్లిని ఒక చేత్తో నడిపించుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు. రైలు రానే వచ్చింది. గోపాలం గుండె దడదడ లాడింది. రైలంటే భయం. ప్రయాణమంటే భయం కాని ఈ ప్రయాణంలో తను ఒక్కడే కాదు వంటరివాగు కాదు. పిన్నా పెద్ద నలుగురినీ కలుపుకుపోతున్నాడు. అదే అతనికి గుండెధైర్యాన్నిచ్చింది. రైలు వైపుకు నడిపింది.